క్లుప్తంగా

ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు



సాక్షి ఎఫెక్ట్

పెనుగంచిప్రోలు: ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ నియంత్రణపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. 'ట్రాఫిక్ కష్టాలతో ప్రజలు సతమతం' శీర్షికన శనివారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఎస్ఐ ఎంఎస్‌కె అర్జున్‌తోపాటు సిబ్బంది ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ సెంటర్, కాజ్‌వేపై, కాజ్‌వే అవతల ప్రత్యేక చర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. శ్రీతిరుపతమ్మ ఆలయానికి వచ్చే వెళ్లే వాహనచోదకులు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు.

కూటమి ప్రభుత్వంలో బీసీలపై దాడులు



పెనుగంచిప్రోలు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో బీసీలపై దాడులు జరుగుతున్నాయని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బత్తుల రామారావు అన్నారు. పెనుగంచిప్రోలులో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీమంత్రి, బీసీ మహిళా నేత విడదల రజనిపై దురుసుగా ప్రవర్తించిన చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బానాయుడు తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రజనితో అనుచితంగా ప్రవర్తించడంతోపాటు మీపై కూడా కేసు పెడతానని ఆయన దురహంకారానికి నిదర్శమన్నారు. ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం, రానున్న రోజుల్లో బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దేరంగుల శ్రీనివాసరావు, బీసీ నాయకులు చేని రాంబాబు, గుడిమెట్ల శంకర్, బొజ్జా సాయి, నలబోతు వెంకటేష్ పాల్గొన్నారు.

గండేపల్లి రోడ్డుకు మరమ్మతులు చేపట్టరూ...



కంచికచర్ల: మండలంలోని గండేపల్లి నుంచి కీసర వెళ్లే రోడ్డు గోతులమయం కావడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్రఇబ్బందులుపడుతున్నారర్రీ గోతుల విషయం తెలియక రాత్రివేళ పలువురు వాహనచోదకులు వీటిల్లో పడి గాయాలపాలవుతున్నారు. గండేపల్లిలో సెంటినీ కర్మాగారానికి ఇతర ప్రాంతాల నుంచి పెద్దపెద్ద వాహనాల కారణంగా రోడ్డు రోజురోజుకు దెబ్బతింటోందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపాటి వర్షానికే ఆయా గోతుల్లో నీరు నిలుస్తుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి గండేపల్లి–కీసర రోడ్డును అభివృద్ధి చేయాలని వాహనోదకులు, ప్రయాణికులు కోరుతున్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: శ్రీవాసవి సేవా సంస్థ ఆధ్వర్యంలో బాటసారులకు ఆదివారం మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. వ్యాపారి అప్పన మురళీకృష్ణ పుట్టినరోజును పురస్కరించుకుని ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు దాచేపల్లి శ్రీనివాసరావు, మురళీకృష్ణ మజ్జిగ పాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు బండారు సైదేశ్వరరావు, డోగుపర్తి రమేష్, ఎ.అశోక్, స్వామి దిలీప్, వాసవి సేవాసంస్థ జిల్లా ప్రతినిధి పేరూరి నరసింహారావు, జిల్లా అధ్యక్షుడు యన్నాకుల రాంబాబు, పట్టణ అధ్యక్షుడు కర్లపాటి కొండ, వరగాని రాజశేఖర్, యన్నాకుల అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల : స్థానిక మండల పరిషత్‌కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి తెలిపారు. ప్రజలు ఆయా సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని వివరించారు. ఈకార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గంజాయి మత్తు... యువత చిత్తు

- పల్లెల్లోనూ దొరుకుతున్న గంజాయి..
- తెలంగాణ సరిహద్దుల నుంచి రాష్ట్రంలోకి
- పోలీసులు దాడులు చేస్తున్నా ఆగని గంజాయి విక్రయాలు
- ఆందోళనలో యువత తల్లిదండ్రులు

పెనుగంచిప్రోలు: గంజాయి మత్తుకు యువత చిత్తవుతున్నారు. ఎక్కడపడితే అక్కడ విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయి యువత బంగారు భవిష్యత్తును నాశనం చేస్తోంది. ఒకప్పుడు పట్టణాలు, నగరాలకు పరిమితమైన గంజాయి...నేడు పల్లెల్లో సైతం జోరుగా విస్తరిస్తోంది. మత్తుకు బానిసలైన ఎందరో యువకులు తమ బంగారు భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. గంజాయి రవాణాను అరికట్టడంలో నందిగామ సబ్‌డివిజన్ పరిధిలోని పోలీసు, ఎక్సైజ్ అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. గంజాయి విక్రేతలు ఎప్పటికప్పుడు కొత్త మార్గాల్లో గంజాయిని సరఫరా చేస్తూ పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది కంటపడకుండా సరిహద్దులు దాటిస్తుండటం గమనార్హం.

ఎవరికీ అనుమానం రాకుండా..

తెలంగాణ సరిహద్దులో ఉన్న వత్సవాయి గ్రామంలో ఈనెల 4న కొత్త తరహాలో ఎవరికీ అనుమానం రాకుండా సరఫరాదారులు గుర్రంపై ఉంచిన సంచుల ద్వారా గంజాయి రవాణా చేపట్టారు. ఓ బైక్‌తో ఆ గుర్రంను అనుసరించేలా ఓ పైలెట్‌ను సైతం ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ గుర్రం తరచూ వత్సవాయి ఎస్సీకాలనీలోకి వస్తుండటంతో స్థానికులకు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించడంతో గుర్రంతోపాటు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. గుర్రాన్ని తీసుకువచ్చిన ఇద్దరు వ్యక్తులు మాత్రం పరారయ్యారు.



ఇటీవల వత్సవాయిలో గంజాయి పొట్లాలతో పట్టుబడిన గుర్రం(ఫైల్)

ఉలిక్కిపడిన పుణ్యక్షేత్రం..

గతనెలలో విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు వారు పెనుగంచిప్రోలులో పలుచోట్ల సోదాలు నిర్వహించి ఓవ్యక్తి నుంచి పదికేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి దిగువన మునేరు మధ్యలో జనసంచారం లేని మామిడితోటలో దట్టమైన చెట్లలో గంజాయితో ఉన్న బ్యాగ్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకోవడంతో పెనుగంచిప్రోలు ఒక్కసారిగా ఉలిక్కిపడింది.

పరిటాలలో పదికేజీలు..

రెండు నెలల కిందట కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలోని ఓ వెంచర్‌లో విజయవాడ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తుండగా స్థానికులు దాడి చేసి వారిని అదుపులోకి తీసుకోవటంతోపాటు 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పేట మండలంలో 80కేజీలు..

ఈ ఏడాది జనవరిలో ఏపీ నుంచి తెలంగాణకు కారులో తరలిస్తున్న 80 కిలోల గంజాయిని జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం గ్రామం వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిల్లకల్లు టోల్ ప్లాజా వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌కు సంబంధించి కారు దూసుకురావడంతో పోలీసులు వెంబడి గౌరవరం వద్ద ఆ వాహనం నుంచి 80కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇలా ప్రతినెలా నందిగామ పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఏదో ఒక చోట భారీస్థాయిలోనే గంజాయి పట్టుపడుతుండటం స్థానికులను కలవరపెడుతోంది. విచ్చలవిడిగా సాగుతున్న గంజాయి రవాణ, విక్రయాల కారణంగా యువత మరింత పెడద్రోవపడుతోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

చెక్‌పోస్టులు ఉన్నా...

ఖమ్మం జిల్లా సరిహద్దు గ్రామాల నుంచి నందిగామ సబ్‌డివిజన్‌లోకి గంజాయి యథేచ్ఛగా రవాణా అవుతోంది. సరిహద్దుల్లో చెక్‌పోస్టులు ఉన్నా లాభం లేకుండా పోయింది. గతంలో చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను ముమ్మరంగా చేయడంతో గంజాయి కట్టడి జరిగిందని, ప్రస్తుతం ఆయా చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది సైతం తనిఖీలను మమ అనిపిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాల సమయంలో మినహా మిగిలిన సమయాల్లో చెక్‌పోస్టు సిబ్బంది సైతం అమ్యామ్యాలకు అలవాటుపడి వాహనాలను సరిగా తనిఖీలు చేయకపోతుండటం కూడా ఈ గంజాయి రవాణాకు మరో కారణమనే గుసగుసలు వినిపిస్తున్నాయి. గంజాయి మత్తు కారణంగా పట్టణాలతోపాటు పల్లెల్లో కూడా పలుచోట్ల ఘర్షణలు, కొట్లాటలు చోటుచేసుకుంటున్నాయి. ఇకనైనా పోలీసు, ఎక్సైజ్‌శాఖల ఉన్నతాధికారులు సమన్వయంతో వ్యవహరించి ఈ గంజాయి రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

గట్టి నిఘా పెట్టాం..

సరిహద్దు మండలం వత్సవాయి నుంచి గంజాయి రవాణా జరగకుండా గట్టి నిఘా పెట్టాం. చెక్‌పోస్టుల వద్ద ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నాం. గంజాయి రవాణా, విక్రేతల సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– జి.ఉమామహేశ్వరరావు, ఎస్ఐ, వత్సవాయి

విద్యార్థులకు యోగాపై శిక్షణ

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు యోగా, ధాన్యంపై శిక్షణనిచ్చారు. యోగా శిక్షకులు మొండితోక మణి, బి.సురేష్ పాల్గొని వారిచే యోగా సాధన చేయించారు.కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులు పుస్తక పఠనం, ఇంగ్లిష్, లెక్కలు, మైండ్ గేమ్, ఆటలు, డ్రాయింగ్, చెస్ తదితర అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పర్యవేక్షించారు. కార్యక్రమంలో నీలం సర్వేశ్వరరావు, ఎం.కనకారావు, విద్యార్థులు పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న విద్యార్థులు

కనులపండువగా కల్యాణోత్సవాలు

నందిగామరూరల్: మండలంలోని దాములూరు కూడలిలో వేంచేసియున్న భూనీలా సమేత చెన్నకేశవస్వామి వారి ఆలయ వార్షిక ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు, అష్టోత్తర సహస్త్ర నామ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపంలో స్వామివారి దివ్య కల్యాణాన్ని వేదోక్తంగా నిర్వహించారు. పలువురు దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ క్రతువులు జరిపించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పల్లగిరి గట్టుపై...

నందిగామరూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం ఆలయ అర్చకుడు విజయసారథి సంపత్‌కుమార్ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ మండంలో స్వామివారి కళ్యాణాన్ని వేదోక్తంగా జరిపించారు.



పల్లగిరి గట్టు ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవం

ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ర్యాలీ

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ఆపరేషన్ సిందూర్‌కు సంఘీభావంగా ఆదివారం కేఎల్‌రావు పార్కు నుంచి పలు అసోసియేషన్ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్కు హ్యాపీ వాకర్స్ అసోసియేషన్, కేఎల్‌రావు పార్క్ బ్యాడ్మింటన్ అండ్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వాకర్స్ ర్యాలీలో పాల్గొన్నారు. పార్కు వద్ద ప్రారంభమైన ర్యాలీని ఉద్దేశించి అసోసియేషన్ల అధ్యక్షులు బీఎస్‌కే పట్నాయక్, వేశపోగు ఆల్ఫ్రెడ్, జీ రామకృష్ణరావు ప్రసంగించారు. పాకిస్తాన్ ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన మన సైనికులకు దేశ ప్రజలందరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్‌లో కీలక పాత్ర పోషించిన ఇద్దరు మహిళా జవాన్లకు దేశప్రజలందరి తరపున అభినందనలు తెలుపుతున్నామని చెప్పారు. దేశం కోసం అందరం కలిసిమెలసి పని చేయాలని ఇటువంటి విపత్తు పరిస్థితుల్లో సైనికులతో కలిసి పని చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. కేఎల్‌రావు పార్కు నుంచి ప్రారంభమైన ర్యాలీ వీఎంసీ కాలనీ, కేటీ రోడ్డు, కలరా హాస్పటల్ మీదుగా సాగింది. ర్యాలీలో భారత్ మాతకీ జై.. అంటూ చిన్నారులు, యువత నినాదాలు చేశారు. కార్యక్రమంలో జగుపిళ్ల శ్రీనివాసరావు, బీరం శ్రీనివాసరావు, బెల్లం వెంకటేశ్వరరావు, ఎం. ప్రసాద్, సుబ్బారావు, మదన్‌మోహన్, రామకృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్, చిన్నారులు, యువత

మాతృమూర్తులకు సత్కారం

లబ్బీపేట(విజయవాడతూర్పు): మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగునాట క్రియేషన్స్ ఆధ్వర్యంలో పలు రంగాలకు చెందిన మహిళలను ఘనంగా సత్కరించారు. మహాత్మాగాంధీరోడ్డులోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో నగర డీసీపీ కేజీవీ సరిత, మోటివేషన్ స్పీకర్ సత్యవాణి, కూచిపూడి నృత్యకారిణి స్వామిసోమనాథ్, అక్కినేని హాస్పటల్స్ అధినేత డాక్టర్ మణి అక్కినేని, ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌కు చెందిన శృతి రెడ్డి, చంద్రగిరి జెడ్పీటీసీ పద్మజారెడ్డి, ఆదర్శ రైతు ఈశ్వరమ్మలతో పాటు పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు నాట క్రియేషన్స్ అధినేత మాదల వేణు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ ఘన విజయం మన దేశంలోని మాతృమూర్తులందరి విజయం అన్నారు. ఆపరేషన్ సింధూర్‌లో ఇద్దరు మహిళలు ముందుండి నడిపించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా మహిళలు జాతీయ పతకాలను ప్రదర్శించారు.

కరాటే విద్యార్థులకు ఏకాగ్రత అవసరం

పాయకాపురం(విజయవాడరూరల్): కరాటేతో శరీర దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని నున్న ఎస్ఐ విమల తెలిపారు. ఆదివారం పాయకాపురంలో క్యోఇకు కరాటే అకడమీలో చీఫ్ కోచ్ బల్లం కిషోర్ ఆధ్వర్యంలో నాంచాక్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నున్న ఎస్ఐ విమల మాట్లాడుతూ కరాటే విద్యార్థులకు ఏకాగ్రత అవసరమని చెప్పారు. రెప్పపాటు వేగంతో కదిలే విధంగా శరీరాన్ని మార్చుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు ఇలాంటి విద్యలు నేర్చుకొని తమను తాము కాపాడుకోవచ్చన్నారు. గురువులకు, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బల్లం కిషోర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన శ్రీ కనకదుర్గ నృత్య మందిర్‌కు చెందిన పలువురు చిన్నారులు కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. ఆదివారం సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై సాయి సహస్ర పర్యవేక్షణలో 20 మందికి పైగా చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం కళావేదిక వద్దకు చేరుకున్న భక్తులు చిన్నారుల నృత్య ప్రదర్శనను వీక్షించి వారిని అభినందించారు. నృత్య ప్రదర్శన అనంతరం ఆలయ అధికారులు శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి తిరునాళ్ల

నందిగామరూరల్: మండలంలోని లింగాలపాడులో వేంచేసియున్న లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారిని ఆలయ అర్చకులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తొలుత అమ్మవారికి మూలమంత్ర హోమాది క్రతువులు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. తొలిసారిగా అమ్మవారి దీక్ష స్వీకరించి 41 రోజులపాటు నియమనిష్ఠలతో దీక్షను కొనసాగించిన స్వాములు ఇరుముడులు సమర్పించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త చిరుమామిళ్ల వెంకట లక్ష్మీసాయిబాబు ఇంటి వద్ద నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, పట్టు వస్త్రాలను మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చారు. తిరుపతి ఆర్‌జెసి చంద్రశేఖర్‌ఆజాద్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి అమ్మవారి శేషవస్త్రం, మొమెంటోలను అందజేశారు. రాత్రికి పలు రకాల పుష్పాలు, విద్యుత్ దీప కాంతులతో ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై అమ్మవారిని ఉంచి మేళతాళాలు, తీన్‌మార్ వాయిద్యాలు, కళాకారుల విన్యాసాల నడుమ గ్రామవీధుల్లో నిర్వహించిన ఊరేగింపు కనులపండువగా సాగింది. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి ఇరుముడులు సమర్పించేందుకు తరలివచ్చిన దీక్షా స్వాములు



ప్రత్యేకాలంకరణలో లక్ష్మీపేరంటాళ్లు అమ్మవారు

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



క్యూలైన్ ద్వారా అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేసవిసెలవులతోపాటు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావటంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిసిపోయాయి. భక్తులు పాలపొంగళ్లు, బోనాలతో అమ్మవారిని మొక్కులు చెల్లించుకున్నారు. ఆంధ్రా నుంచేగాక తెలంగాణ నుంచి వందల సంఖ్యల వాహనాల్లో భక్తులు తరలి వచ్చారు. ఆలయ అధికారులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు వాహనాల రద్దీ కొనసాగింది. ఆలయం చుట్టూ కాకుండా గ్రామంలో ఎక్కడ చూసినా వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టారు. భక్తులు ఎండవేడికి తట్టుకోలేక ఉదయం నుంచి సాయంత్రం వరకు మునేరు అవతల మామిడి తోటల్లో సేదతీరారు.



బోనాలతో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



బోనాలతో భారీగా తరలివచ్చిన భక్తులతో రద్దీగా మారిన ఆలయ ప్రాంగణం

సీపెట్ డిప్లమో కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

మైలవరం: సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) డిప్లమో కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ సీహెచ్ శేఖర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి గల డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో రెండేళ్ల వ్యవధి గల పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లమో ఇన్ ప్లాస్టిక్స్ పెరాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సులకు అన్‌లైన్‌లో ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉందని, సీపెట్ అడ్మిషన్ టెస్ట్‌ను జూన్ 8 జరుగుతుందని చెప్పారు. అందులో వచ్చిన ర్యాంకు ఆధారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తారని చెప్పారు. ఇతర వివరాలకు ఎస్. రామకృష్ణ, సెల్–93985 35697 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కారును ఢీకొట్టిన టిప్పర్

ముగ్గురికి గాయాలు



మైలవరం: మైలవరం మండలం పుల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్ఐ సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం .. పాల్వంచ నుంచి విజయవాడ వెళుతున్న కారును ఇబ్రహీంపట్నం నుంచి తిరువూరు వెళుతన్న టిప్పర్ లారీ పుల్లూరు సమీపంలో జాతీయ రహదారిపై ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న గోగినేని ఉమామహేశ్వరరావు, అతని కుమారుడు, స్నేహితుడు స్వల్పంగా గాయపడ్డారు. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

వైభవంగా నారసింహుని కల్యాణోత్సవం



మక్కపేట(వత్సవాయి): గ్రామంలోని మూడు ఈనెల గట్టు వద్ద వేంచేసియున్న శ్రీస్వయంభు లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా సాగింది. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ పీటలపై కూర్చున్న దంపతులు స్వామివారి కల్యాణాన్ని కనులపండువగా జరిపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కల్యాణం అనంతరం భక్తులకు అన్నదానాన్ని ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో అర్చకులు సిరికొండ సాయికృష్ణామాచార్యులు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షులు కనగాల రమేష్, సత్తి బేతవోలు మండల బీసీ సెల్ అధ్యక్షులు సత్తి వెంకయ్య, కొండబోలు నాగేశ్వరరావు, ఎంపీటీసీ ఆళ్ల సత్యం కుమారి, ఆళ్ల పెద్దబ్బాయి, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సిలువ ఊరేగింపు



వీరులపాడు: సర్వమానవాళి రక్షణ కోసమే ఏసుక్రీస్తు ఈలోకానికి వచ్చారని ఫాదర్ నీలూరి లూర్దురాజు పేర్కొన్నారు. మండలంలోని జమ్మవరం, బోడవాడ గ్రామాల్లో వేంచేసియున్న పరిశుద్ధ లూర్దుమాత ఆలయ పునః ప్రతిష్ఠా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఏసుక్రీస్తు సిలువను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు ఏసుచూపిన బాటలో నడుచుకోవాలన్నారు. ఈనెల 13న పునః ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని భక్తులు, క్రైస్తవులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. గ్రామ నాయకులు కర్ల రాజు, యాదాల దాసు, కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

116 మందికి కంటిపరీక్షలు



నందిగామటౌన్: పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకే భగవాన్ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో ప్రతి నెలా ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నామని సమితి నందిగామ కన్వీనర్ వాసుదేవరావు తెలిపారు. పట్టణంలోని భగవాన్ సత్యసాయి మందిరంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పెదకాకాని శంకర నేత్రాలయం వైద్యసిబ్బంది 116 మందికి కంటి వైద్యపరీక్షలు చేశారు. 56 మందికి కంటి శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించి, వారిని పెదకాకాని ఆస్పత్రికి తరలించారు. తొలుత సత్యసాయికి ప్రత్యేక పూజలు చేశారు. వాసుదేవరావు మాట్లాడుతూ సేవాసమితి ఆధ్వర్యంలో పేదలకు సేవలందించడం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు.

చంద్రబాబువి డైవర్షన్ రాజకీయాలు

జగ్గయ్యపేట అర్బన్: సీఎం చంద్రబాబువి డైవర్షన్ రాజకీయాలని వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్నమాల శామ్యూల్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇకనైనా ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసులతో వైఎస్సార్ సీపీపై, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న అభిమానాన్ని అడ్డుకోలేరనే విషయాన్ని కూటమి ప్రభుత్వం గ్రహించాలన్నారు. మాజీమంత్రి విడుదల రజనితో అమర్యాదగా ప్రవర్తించిన సీఐ సుబ్బనాయుడుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.